# డెడ్ కేపిటల్

"గొడ్డయినా మనిషిని నమ్ముతుందికాని, ఈ సుందరమ్మతల్లి మాత్రం దేవుడితోసహా ఎవర్నీ నమ్మదు. నా తల్లి ఏ ముహూర్తాన పుట్టిందోకాని" అన్నది మావారి కామన్ కంప్లయింట్.

అది గొడ్డు కాబట్టే నమ్ముతుంది.

ఇంతకీ నా నమ్మకంతోగాని, అపనమ్మకంతోగాని ఆయనకేం సంబంధం లేదు ఆయన నమ్మకానికి కాలమానం ఒకటే. "గురూగారూ" అనే ప్రతి ప్రాణినీ ఆయన తన శిష్యకోటిలో చేర్చేసుకుంటారు. ప్రతి శిష్యుణ్నీ ఆయన నమ్ముతారు.

దేవుడికి భక్తులంతా ఒకటి ఔనో కాదో కాని నా పతి దేవుడికి మాత్రం అంతా ఒకటికాదు.

అతి ముఖ్యులు, అముఖ్యులు, ముఖ్యులు యిలా రకరకాలు, అందులో ప్రమోషను, డిప్రమోషను కూడా వుంటారు.

నిజానికి మావారి శిష్య పరమాణువుల్ని నేనంతగా పట్టించుకోను. వాళ్లూ నన్ను పట్టించుకోరు, ఏదో గురుపత్నిగా ఓ నమస్కారం పారేస్తారు అంతే. అయితే ఒక్క సంగీతరావంటే మాత్రం నాకెందుకో.

అతను నన్నెప్పుడూ అగౌరవ పరచలేదు. సరికదా అందరికంటె ఓ నమస్కారం ఎక్కువే పెడతాడు. పైగా అప్పుడప్పుడు "మీరు చాలా బాగా ఎంబ్రాయిడర్ చేస్తా"రనీ, "మీ వంట అమోఘం" అనీ పొగుడుతాడు కూడా. అయినా అతనంటే నా కెందుకో అంత సదభిప్రాయం లేదు. దానిక్కారణం బహుశా అతను మా వారికి పక్క వాయిద్యం అవడంవల్లనేమో.

"అబ్బ! గురూగారూ! అదిరిపోయిందనుకోండి. యీ పెన్సిలు ఎక్కడ కొన్నారోగానీ ఓ డజను తేలేకపోయారా?" అన్నాడు మావారి

దగ్గరున్న పెన్సిలు ముక్క చూసి.

దానికి మావారు శంకరుడిలా పొంగిపోయి "అదా...అదీ...ఢిల్లీలో పేవ్‌మెంట్ మీద కొన్నాను. డెడ్‌చీప్. రూపాయి పావలా. ఇది మీరు కావలిస్తే తీసుకోండి. నాకింకోటుంది." అని దాన్ని మాంత్రికుడు శిష్యుడికి మంత్రదండం యిస్తున్నంత జాగ్రత్తగా యిచ్చేరు. అతనూ అంత భక్తిగానూ అందుకున్నాడు దాన్ని.

దాని ధర మా వూళ్లో అర్థ రూపాయి.

మరో సారి "అబ్బ! గురూగారూ! అంత వయసొచ్చినా ఏం కెపాసిటీ బాబూ మీది సోడా కూడా అడక్కుండా హాఫ్ బాటిల్ హూత్ అనిపించేశేరు. మేమూ వున్నాం. ఎందుకూ? రెండో రౌండుకి ఆఫ్" అన్నాడు మందుగ్లాసులో సోడా వేసుకుంటూ.

అంతే మావారిలో శంకరుడు శివమెత్తేడు ఆ తరవాత మిగతా హాఫ్‌బాటిల్ గ్లాసుకూడా అడక్కుండా గడగడలాడించేరు. ఆఫ్‌కోర్సు ఆ తరవాత రెండ్రోజులు మంచం దిగలేదు. అది వేరేసంగతి

నాకెందుకో మనంచేసే ప్రతి పనీ పొగిడేవార్ని నమ్మాలనిపించదు.

తల్లి–పిల్లకైనా, మొగుడు–పెళ్ళానికైనా ఆఖరికి యిద్దరు ఫ్రెండ్సుకైనా అన్ని అభిప్రాయాలూ, అభిరుచులూ కలియవు. కలవాలన్న రూలూలేదు. మరింక మనం మాట్లాడిన ప్రతి మాటకీ వన్స్‌మోర్ కొట్టి, చేసే ప్రతీపనీ శెభాష్ అనే వాళ్ళంటే నాకంత సదభిప్రాయం వుండదు.

సంగీతరావు ఈ కోవకే చెందుతాడని నా అంచనా. నా అంచనా తప్పుకాదనడానికి సాక్ష్యం...

ప్రతి ప్రాణి తిండి, గుడ్డ తరవాత కోరుకొనేది తలదాచుకోవడానికి ఓ గూడు.

ప్రతి పక్షికి స్వంత గూడుంటుంది.

ప్రతి పాముకీ ఓ పుట్ట వుంటుంది.

అలాంటిది మనిషినైన నేను ఓ స్వంత ఇల్లు కోరుకొనడంలో తప్పులేదు, అసహజం అంతకన్నా కాదు. కాకపోతే మావారికి ఇల్లంటే ఇష్టంలేదు.

"నీ మొహం, ఇల్లు పరమ డెడ్ కేపిటల్. యింటి మీద వచ్చే అద్దె, అప్పు చేసిన డబ్బుకి వడ్డీక్కూడా గిట్టదు. యిల్లు కట్టడాలు ఎవరికనుకున్నావ్? బ్లాక్ మనీ మూలిగేవాళ్ళకి, మనక్కాదు" అని ఎప్పటికప్పుడు కొట్టిపారేసే ఆయన అమాయకత్వానికి నవ్వాలో, తెలివితక్కువ తనానికి తన్నాలో తెలీలేదు నాకు.

అసలు. కేపిటల్ అనేది వుంటేకదా—అది డెడ్. లైవ్ అయేది? ఎక్కడో అప్పుతెచ్చి కడతాం. ఆ యింటిమీద వచ్చే అద్దెతో ఆ అప్పుతీరి, మనం రిటైరయ్యేనాటికి యిల్లు మిగులుతుంది. అప్పుడు కేపిటల్ యిల్లు రూపంలో ఉంటుంది. కాని మావారితో అర్గుమెంటు చెప్పడంఅంత బుద్ధితక్కువ మరోటిలేదు మరింక స్వంత యిల్లు అన్న మమకారం చంపేసుకున్నాను.

సాధారణంగా మనుషుల అభిప్రాయాలు మారుతూనే ఉంటాయి. కాని మావారి విషయంలో మాత్రం ఆయనకొక ఖచ్చితమైన అభిప్రాయం అంటూ ఉండదు. "యథాశిష్యా తథాగురూ" అనక తప్పదు.

"చూడూ, సుబ్రమణ్యం చెప్పేడు. రోజూ పొద్దున్నే చెమ్చాడు తేనె గ్లాసుడు నీళ్ళలో కలిపి తాగితే చాలా మంచిదిట" అని గిరిజన్ స్టోర్సులో ఓ కిరసనాయిలు సీసాడు తేనె తెచ్చేరు ఓనాడు. తేవడవేఁకాకుండా పిల్లలందర్నీ తాగమని ఆర్డరు వేశేరు.

ఓ వారం అయేక "ఔనూ, అతనేఁవిఁటి అలా చెప్పేడు? యివేళ సత్యనారాయణ చెప్పేడు తేనె హార్టుమీద దెబ్బ కొడుతుందిట నయం. వేగమే మేలుకున్నాం" అని ఆ మిగిలిన తేనె పనిమనిషికో, పాల మనిషికో యిచ్చేశారు.

ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. అసలు సంగతి...

ఆవేళ సుబ్బారావు – అతన్ని మేము సైక్లోను సుబ్బారావు అంటాం. ఓసారి బ్రహ్మాండమైన తుఫానువచ్చి భూమీ అకాశం బద్దలైపోతుంటే, సరిగ్గా ఆ టైములో వచ్చి తన ఉద్యోగం రికమండేషనుకోసం మావార్ని కారులో అదేదో ఊరు తీసుకెళ్ళేడు "బతికుంటే కదటయ్యా ఉద్యోగం తుఫాను తగ్గేక వెళ్ళండి" అని మా నాన్న ఎంతచెప్పినా వినకుండా యిద్దరూ వెళ్ళేరు. వాళ్ళు తిరిగివచ్చేవరకు మాకెవరికీ మనశ్శాంతిలేదు. వాళ్ళారాత్రి ఎన్ని ఎడ్వంచర్సు చేశారో మావారు యిప్పటికీ కథలుగా

చెప్తూ వుంటారు. అదుగో అప్పటినుంచే అతన్ని మేం సైక్లోను సుబ్బారావు అంటాం. అతను వచ్చి "గురూగారూ, ఫలానా కాలనీలో యింకా కొన్ని స్తలాలు మిగిలిపోయేయి, మీరొకటి తీసుకోండి. యిల్లు వాళ్ళే కడతారు. అంతగా మనకి వద్దనుకుంటే యెప్పుడుపడితే అప్పుడే అమ్ముకోవచ్చును. ఎప్పుడు అమ్మినా మనం కట్టినదానికి ఓ రెండువేలు యెక్కువే వస్తుంది కాని, నష్టం వుండదు" అని సలహా యిచ్చేడు.

మా వారికి ఆ సలహా నచ్చింది.

అమోఘంగా నచ్చింది.

ఆ సలహా నచ్చడానిక్కారణం. ఒకటి ఆ సుబ్బారావు మా వారికి అతి ముఖ్యుల్లో అతిముఖ్యుడు. రెండు: ఆ... రెండు వేలు లాభం. ఆయనికి బిజినెస్ అంటే మహా యిష్టం. ఏ బిజినెస్‌కీ, ఆఖరికి కిల్లీ బడ్డీకైనా సరిపోయే డబ్బు మా దగ్గర లేకపోవడం కేవలం మా అదృష్టం. లేకపోతే ఆయన ఎప్పుడో యీ ముష్టి ఉద్యోగం మానేసి బ్రహ్మాండంగా బిజినెస్ చేసి చివరికి మా కందరికీ కలిపి ఒకే చిప్ప యిచ్చేవారు.

ఇంతకీ యింట్లో వున్న వెండి, బంగారం, ఉగ్గుగిన్నె, ఉంగరంతోసహా అన్నీ అమ్మేసి ఓ స్థలం తీసుకున్నారు.

మనుషులమీదలాగే నాకు నా అదృష్టం మీదకూడా అట్టే నమ్మకంలేదు. అయినా అప్పుడప్పుడు మిరకిల్స్ జరగవా అనుకున్నాను. కాని నా విషయంలో ఏదీ శాశ్వతంకాదు అని మళ్ళీ రుజువవడానికి ఎంతోకాలం పట్టలేదు.

కట్టబోయే యింటిలో ఏఏ మొక్కలు వెయ్యాలో, ఎవరిగది ఎలా ఉండాలో మా పిల్లల ప్లాను పూర్తవనేలేదు. ఈలోగా "మా యింజినీర్లు తప్పు ఎస్టిమేట్ చేశారు. మరో నాలుగు వేలు కట్టమని" సొసైటీవాళ్లు లవ్ లెటర్ రాశేరు.

దాంతో మావారు "ఆ యింజినీర్లకి లెక్కలు రాకపోవడం మా తప్పా? పొట్టకోస్తే పదో ఎక్కం కూడా లేని ప్రతివాడూ డొనేషన్లు కట్టి యింజినీర్లు అయిపోతే యిలాగే వుంటుంది." అని గెంతినా మొత్తానికి డబ్బు కట్టేసేరు.

"అమ్మయ్య" అనుకున్నాం నేను, పిల్లలు

ఇక్కడితో కథ అయిపోతే బాగుండేది. కాని అవలేదు ఓ ఏడాది

తరవాత "యిదివరకు మేము మీ దగ్గర తీసుకున్న రేటుకంటె రేట్లు పెరిగేయి. అంచేత మరో అయిదువేలు కట్టమని" మరో లవ్ లెటర్ రాశేరు సొసైటీవాళ్ళు.

ఈసారి మావారు శివతాండవం చేశేరు. "రేటు పెరిగేవరకూ ఏం చేస్తున్నారు వీళ్ళు? వీళ్ళ బద్ధకానికి మేం ఖరీదు కట్టాలా? ఛస్తే కట్టం. అదీగాక యిప్పుడైనా వెంటనే కడతారన్న గ్యారంటీ ఏఁవిఁటి? యిలా ఆర్నెల్లకోసారి 'తే,తే' అంటే యెక్కడినించి తెస్తాం? అమ్మేస్తాను. పీడా వదిలిపోతుంది. డబ్బు బేంకులో పారేస్తే వడ్డీ అయినా వస్తుంది" అన్నారు.

"అతనేదో తెలివితక్కువగా అంటున్నారు కాని యిప్పుడు అమ్మారంటే మరింక కొనలేరు. ఎలాగో తల తాకట్టు పెట్టయినాసరే ఆ డబ్బు కట్టేయండి" అని కొంతమంది స్నేహితులు నాకు రహస్యంగా సలహా యిచ్చేరు.

తల తాకట్టు పెట్టడానికి నాకేం అభ్యంతరం లేదుకాని, మావారి నిర్ణయం ఎవరు మార్చగలరు? అయన మూడ్ కోసం నేను వెయిట్ చేస్తున్నాను ఈలోగా వాలేడు సంగీతరావు "గూరూగారూ...ఏఁవిటి అమ్మేస్తానంటున్నారుట. నిజవేఁనా? ఎలాగో తంటాలుపడి ఉంచేసుకుంటే బావుంటుంది కదా... ఏఁవిఁటీ...యీ గోల పడలేనంటున్నారా...అయితే నేను తీసుకుంటాను. ఇంకెవరికీ మాట యివ్వకండి. నా యిల్లు మీది కాదా?" అంటూ.

మావారు తెగ సంతోషించేరు. సంతోషించి ఊరుకోలేదు. "చూడూ, నేను కట్టినంతే యియ్యి. ఏఁవిఁటీ? వడ్డీనా? నేనేం మార్వాడీననుకుంటున్నావా? అసలు యియ్యి చాలు" అన్నారు.

నాకు నోట మాట రాలేదు.

"హి యీజ్ ఎ పెర్ఫెక్ట్ ఫూల్" అన్నారు. మా మంచికోరే కొందరు.

ఆ తరువాత ఓనాడు అతి సంతోషంగా వచ్చేరు "గుడ్ న్యూస్" అంటూ.

"ముందు మాంచి కాఫీ యియ్యి చెప్తాను" అన్నారు.

చెప్పేరు. ఏఁవఁని?

"మొత్తానికి ఫైనలైజ్ చేసేను. వెధవ యింటిగొడవ. ప్రాణం హాయిగా వుంది" అన్నారు.

"డబ్బు బేంకులో పడెయ్యకపోయేరా?" అన్నాను నేను అమ్మిన బంగారం తల్చుకుంటూ. నేను అమ్మిన రేటుకి మూడింతలైంది యిప్పుడు ధర ఆఖరికి వడ్డాణం చెడగొడితే ఉంగరం వచ్చిందన్నట్లయింది.

ఫెళ్ళున నవ్వేరు.

నవ్వటం అయిపోయేక "మొత్తానికి ఆడగుణం పోలేదు సుమా! నీకు నేను మేనమావఁని నా పోలికా రాలేదు, నాతో పాతికేళ్ళు కాపరం చేశేవు. సావాసదోషమూ అబ్బలేదు...పాపం! అతనిదగ్గర అయిదువేలకి కొంచెం అటో, యిటో ఉందిట. ఏం చేస్తాం? అతనూ మనలాంటి సంసారే. ముందు ఆ డబ్బు ఆ సొసైటీవాళ్ళ మొహాన పారేస్తానన్నాడు. మనపేర వున్న ఇంటికి అతన్ని డబ్బు కట్టమనడం ఎంత యిన్సల్ట్? అంచేత అతని పేర ట్రాన్స్‌ఫర్ చేశేను. మన డబ్బు నిదానంగా నెలకింత అని తీర్చేస్తాట్ట పాపం. సమయానికి యివ్వవలసిన వాళ్ళు యివ్వలేదుట" అన్నారు కాళ్ళూపుతూ

ఇది జరిగి చాలా ఏళ్లైంది. అమధ్య మనసు వుండబట్టక డబ్బుసంగతి యెత్తితే "యిస్తాడులేద్దూ అస్తమానూ అలా తోసేఁస్తే ఎలా? అసలు మనిషి గుణం డబ్బుదగ్గరే తెలుస్తుంది. గవర్నమెంటు దగ్గర్నుంచి ఎరియర్సు రావాలిట. రాగానే యిస్తాడు. అసలు మన యింటికి రావాలంటేనే... ఉహూఁ...యిదైపోతున్నాడు తెలుసా. సుందరమ్మగారు ఏవఁనుకుంటున్నారో ఏఁవిఁటోనని" అంటున్న ఆయన్ని ఏవఁనగలను?

"దేవుఁడికో నమస్కారం పెట్టి వూరుకో" అంది మా అమ్మ.

"అదికూడా యెందుకూ? దండుగ" అన్నారు పిల్లలు.

ఇంతకీ దేవుడు మాత్రం ఏం చేస్తాడు నా పతిదేవుఁడ్ని?

అందరి సంగతీ నాకు తెలీదు కాని, మా విషయంలో మాత్రం ఇల్లు మా వారన్నట్టు డెడ్ కాపిటలే అయింది.

*("ఆంధ్రజ్యోతి" వారపత్రిక)*

★ ★ ★